ప్రజాశక్తి


గురువారం 16 అక్టోబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



సెమినార్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రభుత్వ ఆధీనంలోనే

మెడికల్ కాలేజీలు నిర్మించాలి

- బాపట్లలో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలి
- ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి..
- మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలలో 10 కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ప్రజల నిధులతో ప్రజల భూములపై నిర్మించిన ఈ విద్యా సంస్థలను ప్రైవేటు చేతుల్లోకి అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలోనే

▶ 2లో

రేషన్ బియ్యం..

మూడొంతులు పక్కదారి.!

- సేకరించి వ్యాపారులకు అందజేస్తున్న పాలకపక్షం..
- నియోజకవర్గ స్థాయిలో నేతలకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు
- క్షేత్రస్థాయిలో పార్టీ నేతల మధ్య విభేదాలకు దారితీస్తున్న పంపకాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో మూడొంతుల రేషన్‌బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం మారినా దందా ఆగడం లేదు. టన్నుల కొద్దీ పేదల బియ్యం దారి మళ్లుతున్నాయి. పాలకపక్ష నేతలకు నెలనెలా ముడుపులు తెచ్చిపెడుతు న్నాయి. పేదల ఆహారభద్రత కోసం ప్రవేశ పెట్టిన ఈ పథకం పాలకపక్ష నేతలకు ఆదాయ వనరుగా మారిపోయింది. మూడొంతుల రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కోట్లాది రూపాయల సబ్సిడీలు వృథా అవుతున్నాయి. ప్రభుత్వానికి కూడా రేషన్ దందా వల్ల చెడ్డపేరు వస్తోంది.



అయినా ఆగడం లేదు. అందరికీ తెలిసే చేస్తున్నారు. కార్డుదారులకు బియ్యం ఇవ్వడానికే డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువమందికి బియ్యం బదులు డబ్బులిస్తున్నారు.

రేషన్ డీలర్ల ద్వారా మండలాల వారీగా పాలకపక్ష నేతలు బియ్యం సేకరిస్తారు. అక్కడ నుంచి నియోజకవర్గ స్థాయిలో వాటిని ఒక బడా వ్యాపారికి అప్పగిస్తారు. ఆయన నియోజకవర్గ స్థాయి కీలక నేతలకు ముద్దముడుపుగా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు ఇస్తున్నారు. ఇదే పెద్ద ఆదాయంగా మారింది. పేదలకు మాత్రం కిలోకు రూ.10 మాత్రమే ఇస్తున్నారు. డీలర్ల నుంచి పాలకపక్ష నేతలు రూ.15 నుంచి రూ.20కి కొంటున్నారు. తర్వాత వాటిని బడా వ్యాపారులకు అమ్మేస్తున్నారు. వీటిని సేకరించుకునే అవకాశం ఇచ్చినందుకు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలకు భారీగా నజరానాలు ఇస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతోంది. అన్ని నియోజకవర్గాల్లో ఈ తంతు నడుస్తోంది. ఒక్కోచోట ఒక్కోలా ఉంది. ఎమ్మెల్యేలు ఎవరైనా ఈ నజరానాలు వీటిని తీసుకోకుంటే మండల స్థాయి నేతలకు పంచుతున్నారు. పార్టీ కార్యక్రమాల పేరుతో కొన్నిచోట్ల వీటిని వాడుతున్నారు,. ఏదేమైనా అన్నిచోట్లా ఈ దందా కొనసాగుతోంది. జిల్లాలో 1392 రేషన్ దుకాణాలున్నాయి. 6,61,141 రేషన్‌కార్డులున్నాయి. ఇప్పుడు వీటి స్థానంలో స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టారు. నెలకు 10,580 మెట్రిక్ టన్నుల రేషన్‌బియ్యం ఈ దుకాణాలకు కేటాయిస్తున్నారు. వీటిలో మూడొంతులకు పైగానే పక్కదారి పడుతున్నాయి. బయటకు పోతున్నాయి. రీసైక్లింగు

▶ 2లో



మాగుంటకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి స్వామి

వచ్చే ఎన్నికలలో పోటీ చేయను

ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

▲ 5లో



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జేసీ భావన

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం..

బాపట్ల జేసీగా భావన వశిష్ట

▲ 8లో

అమ్మబోతే రూ.12.. కొనబోతే రూ.50

- గిట్టుబాటు ధర లేక
- ఇబ్బంది పడుతున్న
- వంగ రైతులు

ప్రజాశక్తి-పంగులూరు

ఆరుగాలం కష్టపడి పండించినా.. గిట్టుబాటు ధరలు లేక కూరగాయల రైతులు విలవిలలాడుతుంటే.. అదే కూరగాయల ధరలు వినియోగదారుడి దగ్గరికి వచ్చేసరికి ఆకాశాన్ని అంటుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టి, కష్టపడి పనిచేసిన రైతు అప్పుల పాలవుతున్నాడు. ఏ పనీ చేయకుండా.. మార్కెట్లో ఉన్న వ్యాపారులు మాత్రం లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నాడు. మార్కెట్ మాయాజాలంలో కూరగాయల రైతులు బలవుతున్నారు అనటానికి ఇదో ఉదాహరణ.



తూర్పు తక్కెళ్ళపాడులో వంకాయలను మార్కెట్‌కు తరలిస్తున్న దృశ్యం


పంగులూరు మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన షేక్ పెదమీరావలి పంగులూరు నుండి తక్కెళ్ళపాడు వెళ్లే రోడ్‌లో 80 సెంట్ల భూమిలో వంగతోటను సాగు చేశాడు. ఇప్పటివరకు సుమారు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి.. ఇంటిల్లిపాదీ వచ్చి పనిచేస్తున్నారు. కాయలు కోసి మార్టూరులోని కూరగాయల మార్కెట్‌కు తీసుకువెళితే అక్కడ కిలో రూ.10 నుండి 15 రూపాయలే ధర వేస్తున్నారని మీరావలి తెలిపారు. అదే వంకాయలు వినియోగదారుడికి రూ.40 నుండి రూ.50 వరకు అమ్ముతున్నారు. 35 రూపాయలు మార్కెట్లోని వ్యాపారులు, దళారులు కాజేస్తున్నారు. కుటుంబం మొత్తం ఈ తోట మీదనే ఆధారపడి జీవిస్తున్నామని మీరావలి తెలిపారు. ఐదు రోజులకు ఒకసారి కోత కోస్తామని, ట్రిప్పుకు 12 క్వింటాళ్ల వరకు వంకాయల దిగుబడి వస్తుందని

▶ 2లో

అమ్మబోతే రూ.12.. కొనబోతే రూ.50

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. కాయలు కోసేందుకు ఆరుగురు కూలి మనుషులు కావాలని, గోతాలు ఒక్కోటి 30 రూపాయలు చొప్పున కొనుక్కొని, ఒక్కో గోతానికి 50 రూపాయలు చొప్పున ఆటో బాడిగ ఇవ్వాలని మీరావలి తెలిపారు. ఇంత కష్టపడి మార్కెట్లోకి తీసుకెళ్తే ధరలు పూర్తిగా తగ్గిపోయి.. కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో అన్ని రకాల కూరగాయల పరిస్థితి ఇదే విధంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను వదిలేసిందని, ఏ పంటకు గిట్టుబాటు ధర రావటం లేదని అన్నారు. గిట్టుబాటు ధరలు లేక, పెట్టిన పెట్టుబడులు రాక, రైతులు ఏ పంట వేసుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించి, పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు.



సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న వైసిపి నేతలు

సంతకాల సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి-పొదిలి

ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేయడానికి నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో పొదిలిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట బైటాయింపు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలో 2016లో పట్ట పగలు పిన్నిక చెన్నకేశవులు హత్యకు గురయ్యాడు. కుటుంబీకుల మధ్య జరిగిన గొడవలే అప్పట్లో హత్యకు దారితీశాయి. ఈ కేసు కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసులో తనకు న్యాయం చేయాలని చెన్నకేశవులు భార్య లక్ష్మిరాజ్యం, కుమారుడు దుర్గా ప్రసాద్ మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం బైఠాయించారు. పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు తన సిబ్బందితో ఆమె వద్దకు వచ్చి వివరణ ఇచ్చారు. ఈ కేసు కోర్టులో విచారణ జరుగుతోందని, ఇక్కడ నిరసన తెలపడం సరికాదని సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



పోలీసు స్టేషన్ ఎదుట బైటాయించిన బాధితులు

ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కాలేజీలు నిర్మించాలి

(మొదటిపేజీ తరువాయి)

వైద్య విద్య, ప్రజారోగ్యం కొనసాగాలని కోరుతూ పట్టణంలోని స్థానిక ఎస్‌జె రంగనాయకులు మరియు బాపనమ్మ కళ్యాణ మండపంలో బుధవారం జెవివి, పిఎవి, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు బి.హరిబాబు అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కెఎస్.లక్ష్మణరావు, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి.రమణయ్య హాజరై మాట్లాడారు. వైద్యవిద్య, వైద్య సేవలు పేదలకు అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన సమయంలో వాటిని పూర్తిగా ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం వెనుకంజ చర్య అని విమర్శించారు. కోవిడ్ కాలంలో ప్రభుత్వ వైద్యశాఖ ఎంత ప్రాణాధారంగా పనిచేసిందో మరిచి.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను విస్మరించడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం మార్కాపురం, ఆదోని, మదనపల్లి, పులివెందుల కళాశాలల భూములను 66 సంవత్సరాల పాటు ఎకరాకు వంద రూపాయల లీజుకు ప్రైవేటు భాగస్వాములకు అప్పగించేందుకు ముందుకెళుతుండటం ప్రజావనరుల దుర్వినియోగమని అన్నారు. 1923లో ఆంధ్ర మెడికల్ కాలేజీ స్థాపన నుంచి 2019 వరకు రాష్ట్రంలో కేవలం 12 ప్రభుత్వ మెడికల్ కళాశాలలే ఉండగా, గత ప్రభుత్వం ప్రజల దీర్ఘకాల డిమాండ్ మేరకు 17 కొత్త కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. వీటిలో 7 పూర్తయ్యి, 5 కళాశాలల్లో ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యి 750 కొత్త సీట్లు పెరిగాయన్నారు. అయితే కూటమి అధికారం చేపట్టిన తర్వాత పులివెందుల, పాడేరు కళాశాలలకు కేటాయించిన సీట్లను తగ్గించడం, ఇప్పుడు పది కళాశాలలను ప్రైవేటుపరచడం వల్ల వైద్య విద్యలో పేదలకు అవకాశాలు మరింత తగ్గిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో 65 వేల మంది నీట్ పరీక్ష రాయగా 36,776 మంది క్వాలిఫై అయ్యారని, సీట్లు పెరగకపోవడంతో వేలాది మంది విద్యార్థులు విదేశాలకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం పది మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో అప్పగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో నిర్మాణం చేయడాన్ని అభ్యుదయవాదులు, ప్రజాసంఘాల నాయకులు అందరూ వ్యతిరేకించి.. ఐక్యమత్యంతో ఉద్యమించాలని తీర్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం.. మూడొంతులు పక్కదారి.!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. కొన్ని ఇక్కడే పాలిషింగ్ చేసి.. మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇలాంటి వాటిని కూడా గతంలో దాడులు చేసి పట్టుకున్నారు. కొన్ని ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. మరికొన్ని పేద దేశాలకు పోర్టుల ద్వారా వెళుతున్నాయి. వీటిపై ఎక్కడా అవాంతరాలు లేవు. అన్ని స్థాయిలో ఈ వ్యాపారం నుంచి పంపకాలు సాగుతున్నాయి. ఎన్ని రకాలుగా ఆధునిక పద్ధతులు వచ్చినా రేషన్‌బియ్యం వ్యాపారం మాత్రం ఆగడం లేదు. ఓ నియోజకవర్గంలో ఈ డబ్బును ఇటీవల కీలక నేతలకు పంచారు. నేతల మధ్య విభేదాలు రావడంతో వాటిని ఆపేశారు. ఒకటీ రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తీసుకోకపోయినా దిగువస్థాయి నేతలకు అప్పగించారు. కొన్ని చోట్ల మండలాల వారీగా పంపకాలు చేశారు. ఏదేమైనా రేషన్ దందా వివిధ రూపాల్లో నడుస్తోంది. ఎక్కడా దాడులు ఉండవు. అధికారులు కూడా వాటిపై దృష్టి సారించినా సమస్యగానే ఉంది.రాజకీయ అండదండలతోనే ఇదంతా నడుస్తున్నందున ఎవరూ పట్టించుకోవడం లేదు. పేదలకు నాణ్యమైన బియ్యం సక్రమంగా అందేలా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

స్మార్ట్ రేషన్ కార్డులు అందజేత

ప్రజాశక్తి-మద్దిపాడు

స్మార్ట్ రేషన్ కార్డులతో సరుకులకు భద్రత ఉంటుందని టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్ బాబు తెలిపార. మండల పరిధిలోని బసవన్నపాలెం గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పోలు విశ్వనాథ్, రెబ్బవరపు ప్రభాకర్, తుమ్మల వీరాంజనేయులు, మండవ గోవింద రాజులు, మండవ లక్ష్మీనారాయణ, రెబ్బవరపు హరికష్ణ, బొబ్బురి రాంబాబు, వీరగంధం శేఖర్, కోమటినేని శ్రీనివాసరావు, గూడపాటి వశిష్ఠ, కొంగాల రామమోహన్, యడ్లపల్లి అరవింద్, మండవ వెంకటస్వామి, రాంబాబు, సర్వేయర్ సుశీల్, వీఆర్వో మానస, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హవీల, డిజిటల్ అసిస్టెంట్ భార్గవి, వెల్ఫేర్ అసిస్టెంట్ కళ్యాణి పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో దద్దాల నారాయణ యాదవ్

వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కనిగిరి

ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అతిథులుగా పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కసుకుర్తి ఆదెన్న పాల్గొన్నారు. డా ఏపిజె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సంతకాల సేకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం, వైద్య విద్య అందించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మిస్తున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో వాటిని ప్రైవేటు పరం చేసి పేదలకు వైద్యాన్ని దూరం చేస్తోంది అని అన్నారు. అనంతరం బత్తుల బ్రహ్మానందరెడ్డి, కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ, ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉండదు. పేదలకు వైద్యం ఖరీదైపోతుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, నాయకులు సూరసాని మోహన్ రెడ్డి, డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, సిరుప గోవర్ధన్ రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, పులి శ్రీనివాసరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, మల్లెల యాకోబు, శెట్టిపల్లి కొండయ్య, రహీం, కటికల వెంకటరత్నం, హనుమారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది బాధ్యతగా పని చేయాలి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

ఉపాధి హామీ పథకంలో పని చేసే సిబ్బంది తమ విధి నిర్వహణలో బాధ్యతగా పని చేయాలని ఎంపిడిఓ ప్రతాపరెడ్డి తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కూలీలకు ఇకెవైసీ వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు



విద్యార్థులతో మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

హనుమంతునిపాడు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం అరకొర సౌకర్యాలతో నడుస్తుందని, దీనికి శాశ్వత భవనం నిర్మించాలని సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహం ఇనుప రేకుల నివాసంలో నడుస్తుందని ఎండల తీవ్రతకు ఒక విద్యార్థి కూడా హాస్టల్లో ఉండటానికి అవకాశం లేదన్నారు. మొత్తం 90 మంది విద్యార్థులు నాలుగు ఇరుకుగదుల్లో ఉంటున్నారని, ఒక్కొక్క గదికి ఒక ఫ్యాన్ మాత్రమే ఉందన్నారు. సరైన వసతులు లేవన్నారు. స్టోర్ రూమ్స్ సైతం వర్షం వస్తే కారే పరిస్థితి ఉందన్నారు. 90 మంది విద్యార్థులకు రెండు బాత్రూములు మాత్రమే ఉన్నాయన్నారు. పారిశుధ్యం సక్రమంగా లేక దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. దళిత విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడి సొంత బిల్డింగు ఏర్పాటు చేసి సౌకర్యవంతంగా హాస్టల్లో తీర్చిదిద్ది విద్యార్థులకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య, ఏలియ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై సిబిఐ విచారణ చేపట్టాలి

మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

శింగరాయకొండలో వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-శింగరాయకొండ



శింగరాయకొండలో కొనసాగుతున్న ర్యాలీ

నకిలీ మద్యంపై సిబిఐ విచారణ చేపట్టి దోషలను కఠినంగా శిక్షించాలని మాజీమంత్రి, కొండపి వైసీపీ ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం శింగరాయకొండలోని క్యాంపు కార్యాలయం నుంచి జివిఆర్ రోడ్డు మీదగా మెయిన్ రోడ్డు మీదగా ఆర్టీసీ బస్టాండ్ నుండి మూలగుంటపాడులోని ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నకిలీ మద్యం తయారుచేసి ప్రజల ప్రాణాలతో తెలుగుదేశం నాయకులు చాకటమాడుకుంటున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని. నకిలీ మద్యం వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పిడిసిసి బ్యాంక్ చైర్మన్ రాష్ట్ర వైసీపీ నాయకులు డాక్టర్ మాదాసి వెంకయ్య, నాయకులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి, మసనం వెంకటరావు, చింతపల్లి హరిబాబు, బచ్చల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని ఐకెపి కార్యాలయంలో బుధవారం ఏపిఎం ఎం.అశోక్ వివోఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కనిగిరి ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ రవిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి డ్వాక్రా సంఘానికి రుణాలను మంజూరు చేస్తామన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఏపిఎం అశోక్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు రుణాలు తీసుకోవడంతోపాటు వాటిని సకాలంలో చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌సిసి వజ్రమ్మ, ఎల్జి జిలాని, సీసీలు మహబూబ్ బాషా, సుబ్రమణ్యం, అకౌంటెంట్ షమీల, వీవోఏలు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి-దర్శి

ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతిఒక్కరూ పర్యావరణ పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మెప్మా జీవనోపాధులకు చెందిన బ్రోచర్‌ను ఆర్పీలకు అందచేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత

ప్రజాశక్తి-పొదిలి



మెలిక ప్రసాద్ (ఫైల్)

చేపల వేటకు వెళ్లి కాలువలోని పూడికలో ఇరుక్కుని గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం ఉదయం బయటకు తీశారు. ఈ సంఘటన నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారి పాలెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మెలిక ప్రసాదు (47) మంగళవారం తన భార్యతో కలిసి తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం గ్రామ సమీపంలో సాగర్ పెద్ద కాలువ నుంచి రామతీర్థం జలాశయానికి వెళ్లే మార్గంలో చేపలు పట్టడానికి వెళ్లాడు. కాల్వలో పూడికలో ఇరుక్కుపోయి గల్లంతయ్యాడు. నీళ్లలోకి దిగిన తన భర్త ఎంతకీ రాకపోవడంతో ఆందోళన చెందిన ఆయన భార్య ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. బుధవారం ఉదయం కాల్వ నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనతో కాటూరివారిపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మనస్తాపంతో ఒరిస్సా వాసి ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



ఉరేసుకున్న శ్రీధర్

జీవనోపాధి కోసం ఒరిస్సా నుంచి మార్టూరు వచ్చి చిల్లర దుకాణం పెట్టుకున్న శ్రీధర్ దల్ (58) వ్యాపారం సరిగా సాగక సరుకు కొన్న వారు తీసుకున్న అప్పులు చెల్లించకపోవడంతో మనస్థాపం చెంది తాను ఉంటున్న గదిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మార్టూరు సమీపంలోని జొన్నతాళి స్టేజి వద్ద బుధవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశు వైద్యశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని నిప్పట్లపాడు పశువైద్యశాలలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్ట్, రైతు సేవా కేంద్రాలలో ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని కోరుతూ స్థానిక పశు వైద్యశాల ఏడి డాక్టర్ ఏ శ్రీనివాసులు రెడ్డిని జిఎంపిఎస్ (గొర్రెల మేకల పెంపకందారుల సంఘం)ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆయనను కలిసి నాయకులు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి మెరుగైన పశువైద్య సేవలను అందించాలన్నారు. గొర్రెల పెంపకందారులకు కేసిసి రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకటరావు, మండల అధ్యక్షుడు బొడ్డు రామ్మూర్తి, మండల నాయకులు చిట్టిబోయిన చిరంజీవి, చీమకుర్తి సొసైటీ కార్యదర్శి మేడిపోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో సంఘం కనిగిరి యూనిట్ ఎన్నికల నోటిఫికేషన్

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి తాలూకా ఏపీ ఎన్జీవో సంఘం యూనిట్‌కి బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల అధికారిగా కొత్తపల్లి ముంజేష్, సహాయ ఎన్నికల అధికారిగా షేక్ మగ్దూం షరీఫ్ నియమించబడ్డారు. ఎన్నికల షెడ్యూల్‌తో పాటు మొత్తం 1011 మంది సభ్యులు గల ఓటర్ల జాబితాను స్థానిక ఏపీ ఎన్జీవో భవనం నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేని వారు నామినేషన్ గడువు తేది లోపల సంప్రదించి సభ్యత్వం పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పిల్లి వెంకటేశ్వర రెడ్డి, హజరత్ అలీ, రామలింగారెడ్డి, కిరణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, నరసింహారావు, రహమత్, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీవోగా సుధాకర్

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఉపాధి హామీ పథకం ఏపీవోగా సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వెలిగండ్ల ఏపీఓ శ్రీనివాస్‌నాయక్ ఇన్‌చార్జి ఏపిఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఏపీఓ సుధాకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో ఉపాధి పనులు సమర్ధవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ప్రజాశక్తి-పామూరు

మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పనిచేయాలని వైసిపి సీనియర్ నాయకులు రామిరెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం జయంతి బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా టీచర్ల విభాగం అధికారులు కల్లూరి రామిరెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ కార్యదర్శి గట్ల విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షేక్ చాంద్ బాషా, ఆప్షన్ సభ్యులు నాయబ్ రసూల్, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, షేక్ గయాజ్ , తుపాకుల ఆంజనేయులు, నాయబ్ రసూల్ ,నాగి రసూల్, గడ్డం వెంకట నారాయణ రెడ్డి, షేక్ నాగూరుభాష, చింతంరెడ్డి బాలిరెడ్డి, షేక్ రసూల్, వాకమల్ల కోటి రెడ్డి గారు, షేక్ ఖాసిం ,పటాన్ రసూల్ ఖాన్ పాల్గొన్నారు.

మద్దిపాడు: భారతదేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తులలో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరని మాజీ సర్పంచ్ జే.శరత్ బాబు అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులోని నటరాజ కళా కేంద్రంలో బుధవారం కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఇంజనీర్‌గా, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా బహుముఖ సేవలను అందించారని కొనియాడారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యలమంద, సత్యనారాయణ, కనపర్తి సుబ్బారావు మాట్లాడుతూ కలాం జీవిత విశేషాలను తెలిపారు. కలాంకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాకుమాను సుబ్బారావు, జి.నరసింహా రావు, కటకం వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, సీతారామయ్య, శివ, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: ఖాదరభాష అనాధశ్రమంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు బండ్ల కొండలరావు, వ్యవస్థాపక అధ్యక్షులు పేరం శ్రీనివాసరావు, ఎస్ కే ఖాదర్బాషా, నాయకులు కోటా రాములు, దగ్గు సిద్దయ్య, దావీదు, జంషీర్, శ్రీకాంత్ ,సోమయ్య, వేమా కోటేశ్వరరావు, వెంకటరావు పాల్గొన్నారు.

సీఎస్‌పురం రూరల్: స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతన సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్య, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్నెపల్లి శ్రీనివాసులు, ఎన్‌సీ మాలకొండయ్య, క్లస్టర్ ఇంచార్జి కోనంగి వెంకట కొండయ్య, అట్లూరి రామకృష్ణ రాజు, మైనార్టీ అధ్యక్షులు కూటగుల్లా షేక్ మహబూబ్ బాషా, పఠాన్ ఖాజా, వైస్ సర్పంచ్ పాములపాటి నరసయ్య పాల్గొన్నారు.



అబ్దుల్ కలామ్‌కు నివాళులర్పిస్తున్న విజయరత్నం

టంగుటూరు: మండలంలోని సూరరెడ్డిపాలెంలో శ్రీనిధి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జన్మదిన సందర్భంగా వరల్డ్ స్టూడెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వాయాల విజయరత్నం అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సామాన్యుడి స్థాయి నుంచి రాష్ట్రపతిగా ఎదిగారని కొనియాడారు. ఆయన రాసిన ఎన్నో పుస్తకాలు మనకి విజ్ఞానాన్ని అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిషరీస్ లెక్చరర్ బి.మహేందర్, నీలిమ, పుష్పావతి, టి.గోవిందు. శైలజ పాల్గొన్నారు.

వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేయొద్దు..

ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రమణయ్య

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే వైద్యం వ్యాపారంగా మారి సామాన్యులకు అందనంత దూరంలో వైద్యం ఉంటుందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణయ్య అన్నారు. నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. పేదలకు ప్రభుత్వం వైద్యం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నెలకొల్పిన వైద్య కళాశాలలను ప్రభుత్వ నిర్వహణలో కాకుండా పిపిపి పద్ధతిలో ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఆశించిన ఫలితం పేదలకు దక్కదని అన్నారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాకు వైద్య కళాశాల


వైద్య కళాశాల నిర్మాణాలు పరిశీలిస్తున్న రమణయ్య

అవసరం ఎంతో ఉందని అన్నారు. ఆ లక్ష్యాన్ని నీరుగార్చే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పునరాలోచించాలని అన్నారు. వైద్య విద్యకు వెనుకబడిన తరగతులు, నిమ్న జాతుల ప్రజలు దూరమవుతారని అన్నారు. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ పద్ధతి అందకుండా పోతుందన్నారు. వైద్య కళాశాల నిర్వహణ ప్రైవేటుకు అప్పగిస్తే సామాన్యులకు వైద్య ఖర్చులు మోయలేని భారం అవుతాయని అన్నారు. ప్రభుత్వ నిధులు, ప్రజా ఆస్తిని వ్యక్తిగత స్వార్థం కోసం ఉపయోగించే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వమే వైద్య కళాశాలలు నిర్మించి నిర్వహించాలని అన్నారు. ఆయన వెంట ప్రజారోగ్య వేదిక జిల్లా కన్వీనర్ కె రఘు చంద్, సిఐటియు జిల్లా కార్యదర్శి సి హెచ్ మజుందార్, ప్రజా సంఘాల నాయకులు వై భాస్కరరావు, కె నాగేశ్వరరావు, కె శరత్ పాల్గొన్నారు.


జెసికి పూల మొక్క అందిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

జేసీ భావనకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - బాపట్ల

నూతన జాయింట్ కలెక్టర్ భావన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమెను మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఇఒ శ్రీనివాసరావు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్ 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెవిఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ సంయుక్తంగా ప్రచురించిన మెటీరియల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందించారు. ఈ సందర్భంగా చక్రాయపాలెం జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎఇఒ కెవి శ్రీనివాసరావు చేతుల మీదగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు ఈ రామారావు, ప్రధాన కార్యదర్శి బి పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు అంకారావు, వీరాంజనేయులు, షంసుద్దీన్, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, హనుమంతరావు, రామ్మోహన్ పాల్గొన్నారు.


మెటీరియల్ అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

వేటపాలెం : డిసెంబర్ 7న జరుగనున్న ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు హాజరవుతున్న మండలంలోని ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున, నాలుగేళ్లలో రూ.48వేల ఉపకార వేతనం అందజేస్తుంది. ఈ పరీక్షలకోసం మాజీ శాసన మండలి సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె లక్ష్మణరావు, యుటిఎఫ్ రూపొందించిన మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. వేటపాలెం, పందిళ్ళపల్లి, కటారివారిపాలెం, దేశాయిపేట, కొత్తపేట, అక్కయ్యపాలెం, ఆమోదగిరిపట్నం, కొణిజేటి చేనేతపురి, కొత్తరెడ్డిపాలెం, రావూరిపేట పాఠశాలల్లోని 150 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింజల శ్రీనివాస్, గుగ్గిలం శ్రీమన్నారాయణ, జెవివి నాయకులు కనపర్తి మాల్యాద్రి, పెండెం పోతురాజు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ జ్ఞాన సొసైటి అధ్యక్షుడు, ఉమ్మడి ప్రకాశం జిల్లా బహుజన నాయకులు మైలా చిన నాగేశ్వరరావు తెలిపాడు. ఓటు విలువ, బహుజనుల రాజ్యాధికారం అంశంపై చర్చిస్తారని తెలిపారు. బహుజన నాయకులు జ్యోతి రమేష్ బాబు, మూర్తి, పలనాడు జిల్లా నాయకుడు పిచ్చయ్య, గుంటూరు జిల్లాకు చెందిన వంశీ హాజరవుతారని చెప్పారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ ప్రతినిధులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని కోరారు.

వేధిస్తున్న ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లపట్టాలు తాకట్టు పెట్టుకుని, బెదిరిస్తున్న ఐఐఎఫ్ఎల్ మైక్రో ఫైనాన్స్ సంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. బాధిత పేద మహిళలు ఐద్వా, సిపిఎం ఆధ్వర్యంలో ఐఐఎఫ్ఎల్ బ్రాంచ్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్షన్ మేనేజర్ కె కార్తికేయకు వినతి పత్రం అందజేశారు. అధికవడ్డీలు మాఫీ చేయాలని, న్యాయ బద్ధంగా అసలు కట్టించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ పేదల ఇళ్లపట్టాలపై రుణం ఇస్తామని ముందు నమ్మించి ఏజెంట్ల ద్వారా తక్కువ వడ్డీ అని ఇంగ్లీషులో ఉన్న రుణ ఒప్పందాలపై సంతకాలు చేయించి ఏజెంట్లు రుణాలు ఇప్పించారని అన్నారు. గతంలో పనిచేసిన ఐఐఎఫ్ఎల్ ఉద్యోగులు పేదలను మోసం చేసి కమిషన్లు వసూలు చేసుకుని ఉద్యోగాలు నుండి మానేశారని అన్నారు. ఇప్పుడు ఐఐఎఫ్ఎల్ రికవరీ వాళ్లు అధిక వడ్డీలు కట్టాలని ఫోన్లు చేసి ఇళ్ళమీద ఐఐఎఫ్ఎల్ పేర్లు రాస్తామంటూ వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇళ్ల స్థలాల ఒరిజినల్ పట్టా, బ్యాంక్ అకౌంట్ ఖాళీ చెక్కులు తీసుకొని వాళ్ల దగ్గర పెట్టుకుని బెదిరించటం



ఫైనాన్స్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం, ఐద్వా నాయకులు

బాధాకరమని అన్నారు. ఈఎంఐ బ్యాంక్ అకౌంట్ ద్వారా కాకుండా కలెక్షన్ ఏజెంట్లకు చేతికి చెల్లించిన వారికి ఏటువంటి రసీదులు ఇవ్వటం లేదని అన్నారు. రాత్రి ఆరు గంటల తర్వాత మహిళలకు ఫోన్లు చేయటం, వేధించడం వంటివి చేయకూడదని అన్నారు. కానీ అర్ధ రాత్రి 12గంటలకు కూడా ఇళ్ల తలుపులు కొట్టడం, ఈఎంఐ చెల్లించటం ఒక నెల ఆలస్యమైతే నిత్యం ఫోన్స్ చేసి వేధిస్తున్నారని అన్నారు. లోన్ మొత్తం జమచేసినా ఇంకా ఎంత కట్టాలనేది స్పష్టంగా స్టేట్మెంట్ ఇవ్వకుండా ఇంకా కట్టండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఐఐఎఫ్ఎల్ బ్రాంచ్ దగ్గరకి వస్తే కనీసం సమాధానం చెప్పే వాళ్ళు ఉండరని అన్నారు. ఆఫీసులో ఉన్నవాళ్ళు క్లోజ్ చేసి సమాధానం చెప్పకుండా వెళ్ళిపోతున్నారని అన్నారు. రూ.2.82లక్షల రుణంకు నెలకు రూ.7100 చొప్పున 7ఏళ్లపాటు రూ.6లక్షలు చెల్లించాలని ఇప్పుడు చెప్పతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోతే ఇళ్ల స్థలం క్యాన్సిల్ చేస్తామంటే తప్పని పరిస్థితుల్లో తెలియక ఐఐఎఫ్ఎల్ ఏజెంట్లు, ఉద్యోగుల మాటలు నమ్మి రుణం తీసుకుని మోసపోయారని అన్నారు. ధర్నాలో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు ఎస్‌కె షకీరా, కార్యదర్శి కె నాంచారమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అధిక వడ్డీలు వసూలు చేస్తు బెదిరిస్తున్న ఐఐఎఫ్ఎల్, ఇతర మైక్రో సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళలను కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో బాధిత కుటుంబాలు కూచిపూడి బసవమ్మ, కొక్కిలిగడ్డ దుర్గప్రసాద్, కర్రీ మోషే, కంచర్ల సింధుదేవి, బి రమేష్, చిప్పల కృష్ణంరాజు, ఎస్‌కె షాబీర్యానిసా, గురవమ్మ, సిపిఎం, ఐద్వా నేతలు కె రమేష్, డి అగస్టిన్, ఎన్టీఆర్ నగర్ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి ధనమ్మ పాల్గొన్నారు.

బాలికలు లక్ష్యసాధనలో ముందుండాలి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రతి బాలిక ఒక లక్ష్య సాధనతో ముందుకు సాగాలని వైద్య ఆరోగ్య జిల్లా అధికారి ఎస్ విజయమ్మ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈనెల 18 వరకు వారం రోజుల పాటు జరుగే వారోత్సవంలో భాగంగా మున్సిపల్ హై స్కూల్ నుండి పాత బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ


విద్యార్థుల ర్యాలీలో డాక్టర్ విజయమ్మ

నిర్వహించారు. ఆడపిల్లను పుట్టనిద్దాం, బ్రతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదాలతో జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. స్త్రీ, పురుషుల మధ్య వివక్ష విడనాడాలని అన్నారు. పురుషుల కంటే స్త్రీలు ఏ రంగంలోనూ తక్కువ కాదన్నారు. కార్యక్రమంలో డీఈఒ ఎస్ పురుషోత్తం, ఎంఈఒ ఎస్ నిరంజన్, డి ప్రసాదరావు, డిసి ప్రవీణ్, మౌనిక, హెచ్ఎం రాజశ్రీ, డిఎస్‌ఒ సాదిక్, డిప్యూటీ డెమో బి మరియమ్మ, డిప్యూటీ హెచ్ఈఒ ఆర్ అరుణ, సిహెచ్ఒ నాగేశ్వరరావు, హెచ్‌వి సుధారాణి, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - బాపట్ల

రహదారి భద్రత నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించాలని మోటారు వాహన తనిఖీ అధికారి రంగారావు వాహన చోదకులకు సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో


రహదారి భద్రతపై సూచన చేస్తున్న ఎంవిఐ రంగారావు

వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఫోర్సులో ఉంచుకోవాలని అన్నారు. ప్రయాణ సమయంలో సీటు బెల్టు ధరించాలని చెప్పారు. పరిమితికి మించి వాహనాల్లో పాసింజర్లను ఎక్కించరాదని అన్నారు. సురక్షితంగా ప్రయాణాలు కొనసాగించే విధంగా వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

డాక్టర్ అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని హెూలీ ఫేత్ హైస్కూల్ నందు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. స్కూల్ కరెస్పాండెంట్ పి అరుణ్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. పేదరికం నుండి దేశ అత్యున్నత స్థానానికి


కలాంకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎదిగిన మేధావి అన్నారు. క్షిపణి రంగంలో నిలిచిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలామని అన్నారు. అబ్దుల్ కలాం జీవితం నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడారు. విద్యార్థులు ఎం షణ్ముఖ్, ఎం ప్రేమ్ చరణ్ అబ్దుల్ కలాం జీవితం గురించి చక్కగా మాట్లాడారు. పాఠశాల పూర్వ విద్యార్థులైన మన్నం సాయిరాం, మన్నం ప్రేమ్ చందు పేర్లతో వారి నాన్న మన్నం త్రిమూర్తులు జ్ఞాపికను కరెస్పాండెంట్ పి అరుణకుమార్‌కు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ నాగరాజు, స్వాతి లక్ష్మి, తిరుపతయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాను మృతి

ప్రజాశక్తి - బాపట్ల

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆర్మీ జవాను ఆసోది గోపిరెడ్డి మృతి చెందగా ఆసోది వారిపాలెంలో సైనిక లాంఛనాలతో బుధ వారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. సర్వింగ్ సోల్జర్ ఆసోది గోపిరెడ్డి సెలవుపై స్వగ్రా మానికి వచ్చాడని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. గత నెల 29న బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ వెనుక వైపు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమా దాన్ని గురయ్యాడని తెలిపారు. ప్రమా దంలో గాయాలపాలైన గోపిరెడ్డి హైదరా బాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స


ఆర్మీ జవానుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

పొందు తూ మంగళవారం మృతి చెందాడని తెలిపారు. బుధవారం స్వగ్రామంలో జరిగిన అంతిమ యాత్రలో ఉమ్మడి గుంటూరు జిల్లా సైనిక సంక్షేమ విభాగం అధికారులు, మాజీ సైనికులు పాల్గొన్నా రు. గోపిరెడ్డికి భార్య వెంకటలక్ష్మి, కుమార్తె విన్మస్య, కుమారుడు దేవాన్ష్ నందనరెడ్డి ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు హనీఫ్

ఎస్సీ, బీసీ హాస్టళ్లకు పర్మినెంట్ వార్డెన్లను నియమించాలి

వసతిగృహాల్లో సిపిఎం పరిశీలన

ప్రజాశక్తి-పామూరు

పామూరు పట్టణంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లలో పర్మినెంట్ వార్డెన్లు లేకపోవడం దురదష్టకరమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం నాడు హాస్టళ్లలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారినా సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఎస్సీ హాస్టల్‌లో స్నానాల గదులకు తలుపులు లేక, ఆరు బయట స్నానాలు చేస్తున్నారని తెలిపారు. రూములలో కిటికీలు లేక దోమల వల్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లలో పర్మినెంట్ వార్డెన్లను నియమించకుండా ఇన్‌ఛార్జి వార్డెన్లతో నడపడం దురదష్టకరమన్నారు. బీసీ హాస్టల్లో ఒక్క వ్యక్తే.. వంట పని, స్వీపర్ పని, సెక్యూరిటీ పని.. అన్నీ తానై విధులు నిర్వహిస్తున్నాడన్నారు. హాస్టళ్లలో ట్యూటర్స్‌కు సరిగా జీతాలు ఇవ్వని కారణంగా ఎవరూ రావడం లేదన్నారు. ఎస్సీ హాస్టల్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలని, స్నానాల గదులకు తలుపులు, కిటికీ రెక్కలు బిగించాలని కోరారు. ఫ్యాన్లు రిపేర్లు చేయించాలన్నారు. విద్యార్థులకు తాగునీటి కోసం ఆరో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.మాల్యాద్రి, కే.శంకర్, సయ్యద్ గౌస్‌బాషా పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, ఉద్యోగులు

మహదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గ్రామీణ తపాల ఉద్యోగుల జాతీయ నాయకుడు జి.ఎస్. మహదేవయ్యను తొలగించిన కేంద్ర తపాల శాఖ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసి, ఆయన్ని విధుల్లోకి తిరిగి తీసుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఏఐజిడిఎస్‌యు) డిమాండ్ చేసింది. కేంద్ర, రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు బుధవారం నాడు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా ప్రకాశం డివిజన్ తపాల ఉద్యోగులు హెడ్ పోస్టు ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న మహదేవయ్యపై క్రమశిక్షణ చర్యల పేరుతో తీసుకున్న తొలగింపు నిర్ణయం అప్రజాస్వామికమని, కార్మిక హక్కులపై దాడి అని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం చేస్తున్న నాయకుడిని తొలగించడం రాజ్యాంగవిరుద్ధమని పేర్కొన్నారు. వెంటనే ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రకాశం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుండి వందలాది గ్రామీణ తపాల ఉద్యోగులు పాల్గొన్న ఈ ధర్నాకు అఖిల భారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘ నాయకులు సంఘీభావం తెలిపారు.

కార్యక్రమానికి ఏఐజీడిఎస్యు డివిజనల్ సెక్రటరీ ఎం. పోలయ్య అధ్యక్షత వహించగా, సర్కిల్ ఆర్గనైజర్ ఎన్. శ్రీనివాసకుమార్, సెక్రటరీ ఈ. వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఏ. శైలజ, జిల్లా మహిళా అధ్యక్షురాలు, డివిజనల్ ఉపాధ్యక్షులు ఈ. విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి ఆర్. కష్ణ ఆంజనేయులు, సర్కిల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే. వెంకటేశ్వర్లు, డివిజనల్ సెక్రటరీ పి. పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికలలో పోటీ చేయను

- ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి
- మాగుంట రాఘవరెడ్డిని ఆశీర్వదించండి
- అట్టహాసంగా ఎంపీ జన్మదిన వేడుకలు



మాగుంటకు శుభాకాంక్షలు తెలుపుతున్న దర్శి నియోజకవర్గ టిడిపి నాయకులు వజ్జా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఒంగోలు పార్లమెంట్ సభ్యునిగా పోటీ చేయనని, తన రాజకీయ వారసునిగా మాగుంట రాఘవ రెడ్డిని జిల్లా ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాంనగర్ 2వ లైన్‌లోని ఎంపి కార్యాలయంలో బుధవారం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి జన్మదిన వేడుకలను మాగుంట అభిమానులు ఆధ్వర్యంలో బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ తన రాజకీయ వారసునిగా వచ్చే ఎన్నికలలో తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి పోటీ చేస్తారన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీచైర్మన్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ కండె శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు, రవిశంకర్ గ్రూపు అధినేత కంది రవిశంకర్, దర్శి తెలుగుదేశం పార్టీ నాయకులు వజ్జా శ్రీనివాసరావు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎన్.లక్ష్మా నాయకులు, పలువురు అధికారులు, మాగుంట అభిమానులు, జిల్లావ్యాప్తంగా టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాగుంటకు శుభాకాంక్షలు తెలుపుతున్న కండే శ్రీనివాసులు

19న ఒంగోలులో జాబ్ మేళా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఇంటర్మీడియట్ బోర్డు మరియు హెచ్‌సీఎల్ టెక్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అక్టోబర్ 19న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఒంగోలులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. భారతదేశపు అగ్రగామి ఐటీ సంస్థ హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్‌బీ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివరాలకు ఎన్. రాజ్‌కుమార్ 7780323850 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

17న స్కూల్ గేమ్స్ పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ సెలక్షన్ పోటీలు అక్టోబర్ 17న మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ చెక్క వెంకటేశ్వర్లు, ఏ.శిరీషకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. . అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలురు, బాలికల కోసం ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయని, జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో హాకీ ఆడే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వారు తెలిపారు.

గురుకులాల టెండర్లలో 'గూడుపుఠాణి..'

- ఫేక్ సర్టిఫికెట్‌తో ఎల్-1 కాంట్రాక్టర్ దరఖాస్తు..
- ఆన్‌లైన్ కాంట్రాక్ట్ పద్ధతికి టెండర్‌లో ఆఫ్‌లైన్ ఒప్పందం
- డిస్ క్వాలిఫై టెండర్‌దారుకు ఇఎండి వాపస్ ఇవ్వని వైనం



ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల టెండర్ అమలులో గూడుపుఠాణి జరుగుతుంది. టెక్నికల్ బిడ్ క్వాలిఫై అయి ఎల్ 1(లీస్ట్ 1) దశకు చేరిన టెండర్‌దారుని ఫైనాన్స్ స్టేజ్‌లో అనర్హునిగా ప్రకటించి, అర్హతలు లేని ఎల్2, ఎల్3 (లీస్ట్ 2, లీస్ట్ 3) దరఖాస్తుదారులకు ఆఫ్‌లైన్ పద్ధతిలో టెండర్ ఖరారు చేశారు. అయితే డిస్ క్వాలిఫై అయిన టెండర్‌దారుకు వెంటనే డిపాజిట్ వాపస్ ఇవ్వాల్సి ఉండగా, టెండర్ ప్రక్రియ ముగిసి రెండు నెలలు కావస్తున్నా డిపాజిట్ వెనక్కి ఇవ్వకపోవడం వంటి అంశాలు పరిశీలిస్తే టెండర్ ప్రక్రియలో గూడుపుఠాణి జరుగుతున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలోని 11 సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 7040 మంది విద్యార్థులకు ఏడాదిలో విద్యాసంస్థలు పనిచేసినంత కాలం అవసరమయిన పెరిషబుల్ గూడ్స్ (కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, పాలు, పెరుగు, చికెన్) సప్లై చేయుటకు జూన్ 13న జిల్లా పర్చేజింగ్ కమిటీ(డిపిసి) ఈ ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్(ఐడి 821557) పిలిచింది.

ఈ-ప్రొక్యూర్‌మెంట్ నిబంధనలు ఇవే..

రూ.6 కోట్ల వ్యయం అయిన టెండర్ ప్రక్రియ, ప్రీ క్వాలిఫికేషన్‌లో టెండర్‌దారు దరఖాస్తు ఫీజు రూ.10 వేలతో పాటు రూ.15 లక్షలు ఇఎండి చెల్లించి డాక్యుమెంటేషన్ చేయాలి. టెండర్‌దారు ఏపీకి చెందిన వాడై, 2022-23 విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల 20 ప్రభుత్వ హాస్టళ్లు, లేదా విద్యాసంస్థలకు ప్రతి ఏటా రూ.6 కోట్లు టర్నోవర్ చేసిన వారు, ఎక్కడా బ్లాక్ లిస్టులో నమోదు కాని ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో రిజిస్టర్ అయిన వారు అర్హులుగా పేర్కొన్నారు. డాక్యుమెంటేషన్ ప్రక్రియలో అన్ని ఆధారాలకు సంబంధించిన పత్రాలు అటెస్ట్ చేయించి జత చేయాలి. ప్రాఫిట్ అండ్ లాస్ అకౌంట్ 3 ఏళ్ల బేలన్స్ షీట్ (ఇన్‌కంటాక్స్) ఆడిటర్ సర్టిఫై చేసి జత చేయాలి. ఈ అర్హతలు ఉన్నవారు ఫైనాన్షియల్ బిడ్‌కు అర్హులుగా పేర్కొన్నారు. ఫైనాన్షియల్ బిడ్ దశలో ఎవరు తక్కువ కోట్ చేస్తే.. వారికి టెండర్ ఖరారు చేస్తారు.

ఫైనాన్షియల్ బిడ్ దశలో ఎల్-1 టెండర్ రద్దు...

దీనికి సంబందించి ది ఒంగోలు కో ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్, చాణక్య ఎంటర్ ప్రైజస్, మారుతి జనరల్ మర్చెంట్, శ్రీనివాస వెజిటబుల్ ట్రేడర్స్, కరుణశ్రీ సైంటిఫిక్ అండ్ కెమికల్ కో సంస్థలు టెండర్‌లో పాల్గొన్నాయి. జూన్ 24న టెండర్లు ఓపెన్ చేయగా చాణక్య ఎంటర్ ప్రైజస్, మారుతి జనరల్ మర్చెంట్ టెక్నికల్ బిడ్ దశలో డిస్ క్వాలిఫై అయ్యాయి. మిగిలిన మూడు టెండర్ దారుల్లో తక్కువగా కోట్ చేసిన కరుణశ్రీ సైంటిఫిక్ అండ్ కెమికల్ కో ఎల్ 1(లీస్ట్ 1)గా పర్చేజింగ్ కమిటీ ప్రకటించింది. అయితే కరుణశ్రీ టెండర్‌దారు ఆడిటర్ సంతకం ఫోర్జరీ చేసారని ఒకరు ఫిర్యాదు చేయడంతో, టెండర్‌దారుకు డిపిసి సంజాయిషీ నోటీస్ ఇచ్చింది. దీనిపై టెండర్ దారు జులై 25న యుడిఐఎన్(యూనిక్ డాక్యుమెంట్ ఐడెంటిఫికేషన్ నంబర్)తో టర్నోవర్ సర్టిఫికెట్ అందజేసినప్పటికీ సంతప్తి చెందని డీపీసీ డిస్ క్వాలిఫై చేస్తూ ప్రకటించడం గమనార్హం. డిస్ క్వాలిఫై అయిన టెండర్ దారుకు వెంటనే ఇఎండి వాపస్ ఇవ్వాల్సి ఉండగా 2 నెలలు కావస్తున్నా రిటర్న్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా ఎల్ 2ఎల్3 టెండర్ దారులకు గత అనుభవంలేదని ఫిర్యాదులు కూడా అందాయి.

ఆఫ్‌లైన్ విధానంలో టెండర్ ఖరారు..

కాగా అధిక మొత్తంలో కోట్ చేసిన ది ఒంగోలు కో ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ వారికి కూరగాయలు, ఆకుకూరలు (రూ.65,61,280) కోడిగుడ్లకు (రూ.6,195), శ్రీనివాస వెజిటబుల్ ట్రేడర్స్ వారికి పాలు, పెరుగు (రూ.33,792), చికెన్ (రూ.56,320) ఆఫ్ లైన్ విధానంలో డిపిసి కమిటీ జులై 25న ఖరారు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రక్రియలో తలెత్తిన సమస్యను సరిదిద్దడానికి టెండర్ రీకాల్ చేయాలన్న నిబంధనలు పాటించలేదని, తక్కువకు కోట్ చేసిన తనను పరిగణలోకి తీసుకో లేదని కరుణశ్రీ సైంటిఫిక్ అండ్ కెమికల్ కో వారు హైకోర్టును ఆశ్రయించగా సెప్టెంబర్ 18న తదుపరి కోర్టు ఉత్తర్వులు ఇచ్చే వరకు టెండర్ ఖరారు చేయొద్దని ఆదేశించారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయని డిపిసి

ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో లీస్ట్-1 టెండర్‌దారు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో సెప్టెంబర్ 18న తనకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు టెండర్‌దారు బుట్టి రమేష్ బాబు పేర్కొన్నారు. 18న కోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ కోర్టు ఉత్తర్వులు పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

నిబంధనలు ప్రకారమే టెండర్ ఖరారు..

డి.జయ, కన్వీనర్, సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాసంస్థలు

ఎల్-1 కాంట్రాక్టర్ ఫేక్ సర్టిఫికెట్ జత చేసినట్లు రుజువు అవడం, అనంతరం ఇచ్చిన యుడిఐఎన్ టర్నోవర్ సర్టిఫికెట్‌తో తృప్తి చెందని డిపిసి చైర్మన్ డిస్ క్వాలిఫై చేసారని తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తరువాత దశలో ఉన్న ఎల్ 2, ఎల్ 3లతో నెగోషియేషన్స్ నడిపి నిబంధనల ప్రకారం వారికి టెండర్ ఖరారు చేశామన్నారు. ప్రొక్యూర్‌మెంట్ జాబితా నుంచి కరుణశ్రీ సైంటిఫిక్ అండ్ కెమికల్ కోను తొలగించినట్లు చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులు వచ్చేనాటికే టెండర్ ఖరారు అయినట్లు తెలిపారు. కోర్టు వివాదం వల్ల ఇఎండి తిరిగి ఇవ్వలేదని స్పష్టం చేశారు.

అనుమతి లేకుంటే చర్యలు తప్పవు..

ప్రజాశక్తి - రేపల్లె



డిఎస్పి శ్రీనివాసరావు

అనుమతి లేకుండా బాణసంచా విక్రయించినా, తయారు చేసి కఠిన చర్యలు తప్పవని డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు హెచ్చరించారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగ జరుపుకోవాలని చెప్పారు. ఎస్పీ బి ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు బద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించిన వారిపై ప్రేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తప్పవని అన్నారు. దీపావళి మందు గుండు సామాగ్రి స్టోరేజ్ గోడౌన్లు, అమ్మకాలు జరిగే ప్రదేశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పక్కాగా పాటించాలని అన్నారు. కేటాయించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేయాలని అన్నారు. చిన్న పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదని అన్నారు. టపాసుల దుకాణాల వద్ద అగ్నిమాపక వాహనాన్ని, అంబులెన్స్ వాహనాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రమాదాల నివారణకు తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

పంగులూరు : దీపావళి మందులు విక్రయించే విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు తెలిపారు. అనుమతి లేకుండా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




సమస్యలు పరిశీలిస్తున్న డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు

కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ శివారు వేలమూరుపాడు డొంకలోని జగనన్న కాలనీలో నివసిస్తున్న ప్రజలు కోరిక మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. కాలనీలోని సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ బలరామిరెడ్డి పాల్గొన్నారు.



తూములు పూడిపోవడంతో వృధాగా పోతున్న సాగర్ నీరు

పూడిపోయిన సాగర్ కాలువ తూములు

ప్రజాశక్తి - పంగులూరు

సాగర్ కాలువలపై అధికారుల పర్యవేక్షణ, నియంత్రణ లేదు. సాగర్ కాలువల చిన్న తూములు పూడిపోయాయి. దీంతో నీటి పారుదలకు ఆటంకం ఏర్పడింది. నీటిని వదిలేందుకు ముందు కాలువలు పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. దీంతో కాలువల్లోని నీరు పొలాల్లో వరదలా ప్రవహిస్తుంది. గత కొంతకాలంగా కోటపాడు, కొండ మంజులూరు గ్రామాల మధ్య కోటపాడు మైనర్ కాలువ తూములు పూర్తిగా పూడిపోవడంతో సాగర్ కాలవల్లో ప్రవహించే నీరు పొలాలపై ప్రవహిస్తున్నాయి. రైతులు వ్యవసాయం చేసుకునేందుకు వీలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై కోటపాడు, కొండ మంజులూరుకు చెందిన రైతులు పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కాలువకు నీరు రావడంతో మళ్లీ పొలాలపైకి నీళ్లు వచ్చాయి. సాగర్ నీరు పొలాల్లో ప్రవ హిస్తున్నాయి. దీంతో తాము వ్యవసాయ పనులు ప్రారం భించే పరిస్థితి లేకుండా పోతుందని రైతులు వాపోతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి ప్రవాహం సాఫీగా జరిగే విధంగా తూముల్లో పూడిక తీయాలని రైతులు కోరుతున్నారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

- ఇలాంటి భవనాలు ఎప్పటికి పూర్తయ్యేనో.?
- ప్రజా ధనం వృథాను పట్టించుకోని అధికారులు
- నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి
- అధికారులు, నాయకులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పర్చూరు



నిర్మాణాలు పూర్తికాని భవనాలు

గత వైసిపి ప్రభుత్వంలో సచివాలయాలు, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలని చెప్పి నిర్మాణాలు చేపట్టిన భవనాలు ఎప్పటికీ పూర్తయ్యేను. అప్పట్లోనే ప్రజాధనం వృధా అన్న విమర్శలు వస్తున్నాయి. ఉన్న భవనాలు వినియోగించుకోకుండా అడ్డు అదుపు లేకుండా భావన నిర్మాణాలు చేపట్టారు. కొన్ని భవనాలు పూర్తయినప్పటికీ వృధాగా ఉన్నాయి. మరికొన్ని భవనాలు అసంపూర్ణంగా మిగిలాయి. వాటికి నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేస్తే వినియోగంలోకి తీసుకురావచ్చు. ఒకవేళ నిర్మాణాలు పూర్తి చేయని పక్షంలో ఇప్పటివరకు భవనాలపై రూ.లక్షల్లో వెచ్చించిన ప్రజాధనం వృధా అయినట్లే. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలంలో అసంపూర్తిగా ఉన్న భవనాల గురించి పట్టించుకోలేదు. ఈ భవనాలు రూ.15 నుంచి రూ.20 లక్షలు అప్పట్లో వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిన నిర్మాణాలు చేపట్టారు. అయితే ఇందులో కొన్ని భవనాలు బేస్మెంట్ వరకు నిర్మాణం జరిగి పిల్లర్లతో ఉన్న నిర్మాణాలు ఉన్నాయి. కొన్ని నిర్మాణాలు స్లాబ్ వరకు వచ్చాయి. గత వైసిపి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను తక్కువ చేసి ప్రజలకు ప్రభుత్వ పాలన దగ్గర చేయాలనే తలంపుతో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చింది. ప్రజల సౌకర్యార్థం, పరిపాలన సౌలభ్యంకు సచివాలయం ఏర్పాటు చేసింది. వారు చేపట్టిన సచివాలయ భవన నిర్మాణాలు పూర్తికాకుండానే అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వాటిపై దృష్టి సారించి నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు. పర్చూరులో మూడు సచివాలయాలు ఉండగా సచివాలయం 1, 2 ప్రభుత్వ సొంత భవనం లేకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి భవన నిర్మాణాలు చేపట్టారు. ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు అర్థంతరంగా ఆగిపోయాయి. మూడు భవన ర్మాణం పూర్తి చేసి కార్యాలయం ఏర్పాటు చేశారు. పర్చూరు పంచాయతీ ఆవరణలో రెండంతస్తుల సచివాలయం భవన నిర్మాణం చేపట్టగా, ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో భవిత భవన్‌కు ఎదురుగా ప్రత్యేక అవసరాల పిల్లలు ఆడుకునే స్థలంలో సచివాలయం రెండు భవన నిర్మాణం చేపట్టారు. ఈ రెండు నిర్మాణాలు నిర్మాణాలు పూర్తి కాలేదు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో నిర్మించిన సచివాలయం భవనం, రైతు భరోసా భవనం, హెల్త్ సెంటర్ అసంపూర్తిగా ఉన్నాయి. ఒక అంగన్వాడీ కేంద్రంకు స్లాబు వేసి వదిలేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభమైన ఇసుక దందా

ప్రజాశక్తి - బట్టిప్రోలు



కృష్ణా నదిలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

కృష్ణా నదికి వరదలు తగ్గటంతో ఇసుక అక్రమార్కులు అనుమతులు లేకుండానే దందాకు తరలించారు. నదీ గర్భంలోనే కాకుండా పంట పొలాలకు ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో ఇసుక వరదలకు మేట వేయడంతో దానిని యదేచ్ఛగా వందల ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. పెదలంక, మధ్యగూడెం, ఏటి ఒడ్డు గూడెం సమీపంలో ఇసుక దందా కొనసాగుతుంది. నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం అధికారులకు తెలిసినప్పటికీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం ఇసుక లోడుతో ట్రాక్టర్లు తిరగటంతో రహదారులు ఛిద్రమవుతున్నాయని, రహదారిపై ప్రయాణించడానికి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయోందోళనకు గురవుతున్నారు. వరదలకు ముందే రీతిలో అక్రమంగా ఇసుక తరలించడంతో పెద్దపెద్ద గుంటలు ఏర్పడి వరదల సమయంలో పంట పొలాలు నది ఒడ్డున విరిగిపడిపోయి నదిలో కలిసిపోయాయని, దానివలన పేదల సొసైటీ భూముల తోపాటు కొంత మంది రైతుల పట్టా భూములు నదీ గర్భంలో కలిశాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇసుక దందా కారణంగా మరోమారు ఇలాంటి ప్రమాదమే పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి భవిష్యత్తులో ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రమ ఇసుక దందా అరికట్టాలని కోరుతున్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ విజయమ్మ

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - బాపట్ల

చేతులు శుభ్రతతోనే వ్యాధులు దరి చేరవని వైద్య ఆరోగ్య జిల్లా అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ అన్నారు. ప్రపంచ చేతులు శుభ్రత దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్, మౌనిక, డిఇఒ ఎస్ పురుషోత్తం, ఎంఈఓ ఎస్ నిరంజన్, డి ప్రసాదరావు, స్కూల్ హెచ్ఎం రాజేశ్వరి, డిప్యూటీ డెమో బి మరియమ్మ పాల్గొన్నారు.

పర్చూరు : చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం కె రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఎం కోటేశ్వరరావు, విజయ కుమార్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే బుధవారం నిర్వహించారు. హ్యాండ్ వాష్ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ మాట్లాడుతూ హ్యాండ్ వాష్ వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం జి శ్రీమన్నారాయణ, సీసీలు నరేంద్ర, రజిని, ఆనోక్, అకౌంటెంట్ శిరీష పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అబ్దుల్ కలాం

ప్రజాశక్తి - బాపట్ల



కలాం విగ్రహానికి నివాళిఅర్పిస్తున్న నరేంద్ర వర్మ

మిస్సైల్ మ్యాన్‌గా ఖ్యాతి ఆర్జించి, భారత అణుశాస్త్ర రంగాన్ని విశ్వవ్యాప్తం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కలాం ఫౌండేషన్ అధ్యక్షులు పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రపతి హోదాలో కూడా అతిసామాన్యమైన జీవితాన్ని గడిపిన నిరాడం బర వ్యక్తని కొనియాడారు. రాజేష్, చార్వాక, ఆంధ్రేయ, పల్లం సరోజినీ, చేజర్ల సతీష్ పాల్గొన్నారు.

అద్దంకి : డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం 94వ జయంతి స్థానిక రోటరీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. బాచిన శివధర పూర్ణచంద్రరావు, అలహరి హరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, అద్దంకి లేవి ప్రసాద్, పువ్వాడ రామకోటేశ్వరావు, చప్పిడి వీరయ్య, గాడేపల్లి దివాకర దత్తు, శ్రీనివాసాయ, సంకా సుబ్రహ్మణ్యం, గూడా లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

బాపట్ల : అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కలాం విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, కాగిత సుధీర్ బాబు, ఏడుకొండలరెడ్డి, కోకి రాఘవరెడ్డి, చీరాల వెంకటేశ్వరరెడ్డి, జోగి రాజా, శ్రీనివాసరావు, ఇమ్మడిశెట్టి రాజు, మచ్చ శ్రీనివాసరెడ్డి, వాలి శ్రీనివాసరెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు.



భర్త ఇంటి ముందు నిరసన తెలియజేస్తున్న భార్య సుగుణ

భర్త ఇంటి ముందు భార్య నిరసన

ప్రజాశక్తి - చీరాల

వేటపాలెం మండలం బచ్చుల వారిపాలెంకు చెందిన చప్పడి వెంకట్రా వు కుమార్తె సుగుణను రెండేళ్ల క్రితం బోయిన వారిపాలెంకు చెంది హోంగార్డు విధులు నిర్వహిస్తున్న బోయిన చంద్రశేఖరరావుతో వివాహం చేశారు. వివాహ సమయంలో కట్నం ఇచ్చినప్పటికీ అదనపు కట్నం కోసం వేధిస్తున్న ట్లు సుగుణ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వేధింపులు తట్టుకోలేక మహిళ భర్త ఇంటి ముందు బైఠాయించి నిరసన చేపట్టగా ఆమె తల్లిదండ్రులు అండగా నిలిచారు. ఆ సమయంలో ఇంటికి తాళాలు వేసి భర్త కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. దింతో కొద్ది సేపు ఉద్రిక్తతకు దారితీసింది. ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు చంద్రశేఖరరావుపై తక్షణ చర్యలు తీసుకోవాలని బాధితురాలు డిమాండ్ చేశారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - చెరుకుపల్లి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

విద్యార్థులు సత్ప్రవర్తన, మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండే విధంగా తోడ్పడేందుకు కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం ఉపయోగపడుతుందని ఎస్ఐ అనిల్ కుమార్ అన్నారు. రాష్ట్ర పిఎంయు కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య బుధవారం పరిశీలించారు. ఎంఇఒ కార్యాలయం, చెరుకుపల్లి, గుళ్ళపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వాటి వలన కలిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు పి లాజర్, టి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత నాలుగేళ్లగా ప్రేమిస్తున్నానని యువతని నమ్మించి, రహస్యంగా పెళ్లి కూడా చేసుకున్నట్లు నమ్మించి లైంగిక వేధింపు వేధింపులకు గురిచేసి చివరికి పెద్దల సమక్షంలో పెళ్లికి నిరాకరించిన యువకునిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పెదలంక మధ్య గూడెంకు చెందిన గొరిగపూడి స్రవంతి అనే యువతిని కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం ఆముదాలలంకకు చెందిన ఆలూరి పూర్ణ చందు అనే యువకుడు గత నాలుగేళ్లగా ప్రేమించుకున్నట్లు ఎస్ఐ ఎం శివయ్య తెలిపారు. గత రెండేళ్లగా యువతిని నమ్మించి శారీరకంగా అనుభవించాడని, యువతి పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకుందామని పట్టు పట్టడంతో నిరాకరించాడని యువతి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పూర్ణచందు ఇప్పుడు పెళ్లి చేసుకుంటే మధ్యలో చదువు ఆగిపోతుందని, తనపై నమ్మకం లేదాని యువతిని నమ్మించి పసుపు తాడు తీసుకువచ్చి ఇంటిలో ఎవరూ లేని సమయంలో బలవంతంగా ఆమె మెడలో తాళి కట్టాడని పేర్కొన్నారు. అప్పటి నుండి స్రవంతిని శారీరకంగా అనుభవిస్తూ మాయమాటలు చెప్పి నమ్మించాడని తెలిపారు. యువతి గర్భం దాల్చడంతో విషయాన్ని చందుకి వివరించిందని, ఈ విషయం తెలిస్తే ఇంటి వద్ద తనకు ఇబ్బంది కలుగుతుందని, చదువుకుంటున్న తమకు ప్రస్తుతం పిల్లలు పుడితే ఇబ్బందులు పడతామని, గర్భం తీయించుకోమని నమ్మబలికి ఒత్తిడి చేశాడని తెలిపారు. అతని మాటలు విని ఓ ప్రైవేటు వైద్యశాల్లో గర్భం తీయించుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇరువురు ఫోను ద్వారా మాట్లాడుకుంటూ యువతి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆమెను శారీరకంగా అనుభవించినట్లు ఫిర్యాదులో యువతి తెలిపారని అన్నారు. ఇటీవల కొంత కాలం నుండి ఆమె ఫోనుకు సమాధానం చెప్పకపోవడం, ఆమె నంబర్ బ్లాక్ లిస్టులో పెట్టడంతో అనుమానం వచ్చి, తనను మోసం చేస్తున్నాడని భావించి కుటుంబ సభ్యులకు విషయం చెప్పినట్లు తెలిపారు. యువతి తల్లిదండ్రులు పెద్దల ద్వారా యువకుని తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చి ఇరువురికి వివాహం చేద్దామని ప్రయత్నించారని తెలిపారు. ఆ యువకుడు, అతని తల్లిదండ్రులు యువతిని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించటంతో సంఘ పెద్దల సమక్షంలో యువతికి కొంత నగదు అప్పగించి రాజీ చేసుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు. యువతి నగదు తీసుకోవడానికి ఒప్పుకోకపోగా తనకు అతనితోనే వివాహం జరిగిందని, తనను అతని వెంట కాపురానికి పంపించాలని పెద్దల సమక్షంలో తెల్చి చెప్పినట్లు తెలిపారు. దీంతో యువకుని కుటుంబ సభ్యులు అంగీకరించక పోవడంతో పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఇరువురిని విచారించి యువకునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి మొయిన్

పోక్సో కేసులో ముద్దాయి అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన 44ఏళ్ల వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు డిఎస్పి మహ్మద్ మొయిన్ తెలిపారు. మండలంలోని ఈపురుపాలెం పోలీసు స్టేషన్లో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 10న వేటపాలెం మండలం అక్కాయిపాలెం యానాది కాలనీకి చెందిన బిట్ల సూరిబాబు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. చిన్నారికి తినుబండారాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పాడుబడిన ఇంటిలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడని అన్నారు. కూలి పనులకు వెళ్లి వచ్చిన తల్లి, దండ్రులకు చిన్నారి బాలిక ఏడుస్తూ జరిగిన విషయం వివరించిందని తెలిపారు. దీంతో తల్లిదండ్రుల ఈపూరి పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికకు ఏరియా వైద్యశాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి సూరిబాబుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పరారీలో ఉన్న ముద్దాయి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కటారివారి పాలెం జీడి మామిడి తోటల్లో దాక్కున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని అన్నారు. సమావేశంలో రూరల్ సిఐ శేషగిరిరావు, ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిందితుడికి వినూత్న ట్రీట్మెంట్

బాలికపై అత్యాచారం చేసిన ముద్దాయి సూరిబాబును పట్టణంలో రెండు కిలోమీటర్ల ప్రదర్శనగా నడిపించారు. చిన్నారులు, మహిళలపై అసభ్య ప్రవర్తనకు పాల్పడితే బహిరంగ నడిరోడ్డుపై నడిపిస్తామని పోలీసులు హెచ్చరించారు. పోలీసుల వినూత్న తీరుపై హర్ష వ్యక్తం చేశారు.



సైబర్ నేరాల సమాచారంపై గోడ ప్రతుల ఆవిష్కరణ

సైబర్ నేరాల పట్ల అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

సైబర్ నేరాలు, ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రాం ద్వారా వచ్చే ఫేక్ వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ రాంబాబు అన్నారు. శక్తి బృందం సౌజన్యంతో జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. సమస్య ఎదురైనప్పుడు 100, 112, 1098, 1930, 1972 నెంబర్లకు ఫోన్ చేస్తే తక్షణమే రక్షణ కల్పించడంతోపాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం సైబర్ నేరాల సమాచారంపై గోడ ప్రతులు ఆవిష్కరించారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ గొట్టిపాటి సత్యనారాయణ

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - అద్దంకి

ప్రతి ఒక్కరూ కంటిపై శ్రద్ధ వహించాలని డాక్టర్ గొట్టిపాటి సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని బంగ్లా రోడ్డులోని ప్రేమ్ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మెగా కంటి వైద్య శిబిరంలో 400 మంది కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ సాలెం రాజు అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు చేయిస్తామని అన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రతిభా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - బాపట్ల

కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు అందించే ప్రతిభా ప్రోత్సాహకానికి కాపు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు 60శాతం మార్కులు సాధించి ఉండాలని అన్నారు. ఇంటర్ మొదటి ఏడాది నుండి పై చదువులు చదివే విద్యార్థినీ, విద్యార్థులకు ఈ ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని కాపు కళ్యాణ మండపంలో దరఖాస్తు పత్రాలు తీసుకొని పూర్తి చేసిన దరఖాస్తు తోపాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జత చేసి ఉదయం 9నుండి 12వరకు, సాయంత్రం 4నుండి 7 గంటల్లోపు అందజేయాలని కోరారు. బాపట్ల నియోజకవర్గానికి చెందిన కాపు విద్యార్థినీ, విద్యార్థులకు మాత్రమే ఈనెల 25లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 93465 69982 నెంబర్లో సంప్రదించాలని తెలిపారు.

రోడ్ల అభివృద్ధిపై ఏలూరి ప్రత్యేక దృష్టి



ఇంకొల్లులో నిర్మించిన సిమెంటు రోడ్డు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలం అభివృద్ధిపై శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు దృష్టి సారించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా సిసి రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి రూ.14.25 కోట్ల మంజూరు చేయించారు. 115 పనులు చేయనున్నారు. తొలి విడత రూ.7.76కోట్లతో 32 పనులు పూర్తి చేశారు. రెండో విడతలో రూ.6.49 కోట్లతో 83 పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ఎంఎల్ఏ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఇంకొల్లులో రూ.2.74 కోట్లతో 27పనులు, పూసపాడులో రూ.1.26 కోట్లతో 7 పనులు, గంగవరంలో రూ.65.90 లక్షలతో 6 పనులు, నక్కలపాలెంలో రూ.58.50 లక్షలతో 7 పనులు, కొణికిలో రూ.75 లక్షలతో 9పనులు, ఇడుపులపాడులో రూ.కోటితో 9 పనులు, వంకాయలపాడులో రూ.57లక్షలతో 4పనులు, పావులూరులో రూ.1.05 కోట్లతో 9పనులు, భీమవరంలో రూ.72.50 లక్షలతో 6 పనులు, నాగండ్లలో రూ.82.50 లక్షలతో 10పనులు, సూదివారిపాలెంలో రూ.84.90 లక్షలతో 9 పనులు, దుద్దుకూరులో రూ.2.80 కోట్లతో 8 పనులు, గొల్లపాలెంలో రూ.36 లక్షలతో 3 పనులు, హనుమాజీ పాలెంలో రూ.18 లక్షలతో రెండు పనులు మంజూరు చేసినట్లు తెలిపారు.

కారంచేడు : మండలం రహదారుల అభివృద్ధిపై శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కృషితో కొత్త రూపు సంతరించుకున్నాయని క్యాంపు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సిసి రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి రూ.9.78కోట్లతో 79 పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలోని ఆదిపూడిలో రూ.52.50 లక్షలతో మూడు పనులు, దగ్గుబాడులో రూ.82.50 లక్షలతో ఏడు పనులు, జరుబులవారిపాలెంలో రూ.35 లక్షలతో నాలుగు పనులు, కేశవరప్పాడులో రూ.35 లక్షలతో మూడు పనులు, కొడవలివారిపాలెంలో రూ.55 లక్షలతో ఐదు పనులు, కుంకులమర్రులో రూ.77.50 లక్షలతో 9పనులు, నాయుడువారిపాలెంలో రూ.55 లక్షలతో ఐదు పనులు, పోతినవారిపాలెంలో రూ.50 లక్షలతో నాలుగు పనులు, రంగప్ప నాయుడు వారిపాలెంలో రూ.20 లక్షలతో రెండు పనులు, స్వర్ణలో రూ.1.10 కోట్లతో 8పనులు, స్వర్ణపాలెంలో రూ.45 లక్షలతో 6పనులు, తిమిడితిపాడులో రూ.80.50 లక్షలతో 5పనులు, కారంచేడులో రూ.2.49 కోట్లతో 16 పనులు, యర్రంవారి పాలెంలో రూ.10 లక్షలతో ఒక పని చేయనున్నట్లు తెలిపారు.



కారంచేడులో నిర్మించిన సిమెంటు రోడ్డు

అపోహలు వద్దు..చీరాల నుండే పోటీ

వైసిపి ఇన్ఛార్జి కరణం వెంకటేష్

ప్రజాశక్తి - చీరాల

తాను చీరాల నియోజకవర్గానికి చెందిన వాడినని, 2029లో జరగబోయే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా చీరాల నుండే పోటీ చేస్తానని, ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని వైసీపీ ఇన్ఛార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. మండలంలోని రామకృష్ణపురం క్యాంపు కార్యాలయంలో పిపిపి విధానానికి వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కాలేజీలను పిపిపి విధానంలో ఇవ్వడం సరికాదని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు భారీ నష్టమని అన్నారు. చికిత్స, వైద్య విద్య సామాన్యులకు అందకుండా పోతుందని మండిపడ్డారు. జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేపట్టామని అన్నారు. పోస్టర్ ఆవిష్కరణతో సంతకాల సేకరణ ప్రారంభించి తొలి సంతకం తానే చేశానని చెప్పారు. గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్చైర్మన్ జైసన్ బాబు, మాజీ ఎంపిపిప గవిని శ్రీనివాసరావు, కౌన్సిలర్ కీర్తి వెంకటరావు, కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ, హచ్ రమేష్, రాజు వెంకటేశ్వరరెడ్డి, బొడ్డు సుబ్బారావు, సాధు రాఘవ, రమణారెడ్డి, సీతామహాలక్ష్మి, చిన్ని లీలదర్, కబీర్, యాతం మేరీ బాబు, ఖాదర్, పి శ్రీనివాసరెడ్డి, సాంబిరెడ్డి, అంకాలరెడ్డి, బిట్ర శ్రీనివాసరావు, దంతం వెంకట సుబ్బారావు, ఆవుల కొండలు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణం వెంకటేష్



స్వచ్ఛంద ఉపాధ్యాయులకు పుస్తకాలు పంపిణీ దృశ్యం

ఉల్లాస్ అక్షరాస్యత పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దెందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అక్షర ఆంధ్ర పేరుతో నిర్వహిస్తున్నట్లు ఉల్లాస్ కన్వీనర్ టి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామీణ నిరక్షరాస్యులకు అర్థమయ్యే రీతిలో వాచకం తయారు చేసినట్లు తెలిపారు. వయోజన విద్య ద్వారా లబ్ధిదారులకు ఆచార, వ్యవహారాలు, ఎన్నికలు, డిజిటల్ విద్య, బ్యాంకింగ్ మొదలైన అంశాలతో సాధన పత్రాలు తయారు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ డి రవీంద్ర మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన ఉల్లాస్ ద్వారా నిర్దేశించిన సమయంలో చదువు చెప్పాలని కోరారు. మెప్మా సిఎంఎం సత్యవతి మాట్లాడుతూ తమ పరిధిలో 4700 మంది నిరక్షరాస్యులను గుర్తించామని తెలిపారు. వారికి ఉదయం, సాయంత్రం వారికి వీలైన సమయంలో పాఠాలు చెబుతామని తెలిపారు. పేదలు, కూలీలకు అనువైన సమయంలోనే విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. సిఐ శ్రీలత, ఆర్పిలు పాల్గొన్నారు.

కుమారుడు కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని తిమ్మిడిదపాడు గ్రామానికి చెందిన తుమ్మల ప్రసాదు తన మూడో కుమారుడు జయప్రకాష్ పర్చూరులో ఐటిఐ చదువుకొని 20 రోజుల క్రితం హైదరాబాదులో పని నిమిత్తం వెళ్లాడని, అప్పటి నుండి తన కుమారుని చూడకుండా ఉండలేక తిరిగి స్వగ్రామానికి రమ్మని పిలిచామని ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం తిరిగి స్వగ్రామానికి వచ్చిన జయప్రకాష్ ఈ నెల 14న మంగళవారం పని కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాదర్ భాష తెలిపారు.

రిజిస్ట్రేషన్ల వివరాలు కలెక్టరేట్‌కు పంపండి

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం



కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రతిరోజూ జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను కలెక్టరేటుకు పంపించాలని కలెక్టర్ పి.రాజాబాబు జిల్లా రిజిస్ట్రారును ఆదేశించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో బుధవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్లో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లాల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం, జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా వచ్చిన ఆదాయం, రిజిస్ట్రేషన్ అనంతరంఆటో మ్యూటేషన్, నిషేధిత భూముల వివరాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరుతున్న తీరు, వంటి అంశాలను జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు కలెక్టరుకు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ గతంలో జిల్లాలో ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో జరిగిన భూ కుంభకోణంపై ఆరాదీశారు. తమ భూమి తమ ఆధీనంలోనే ఉన్నా వెబ్ ల్యాండులో ఇతరుల పేరు ఉన్నట్లు 'మీకోసం' కార్యక్రమంలో ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. తప్పుడు రిజిస్ట్రేషన్లపై సరైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినందున రోజువారీగా భూముల రిజిస్ట్రేషన్ల వివరాలను కలెక్టరేటుకు పంపించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ సిహెచ్.ఎస్ వరప్రసాదరావు, సంయుక్త ఉప రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు దేవాదాయశాఖ అధికారులకు ఆదేశించారు. దేవాలయాల అభివృద్ధితో పాటు వాటి ప్రాశస్త్యం, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జాతర్లు, ఉత్సవాలపై ప్రజలకు తెలిసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో కలెక్టర్ రాజాబాబు, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై ఆ శాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. సమావేశంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయం

నైపుణ్యాభివృద్ధి, మరిన్ని ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా పరిశ్రమలు, అనుబంధ విభాగాలు పని చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏపీఐఐసీ ఉన్నతాధికారులతో బుధవారం ప్రకాశం భవనము లోని తన చాంబర్లో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమల స్థితిగతులు, కొత్త వాటిని స్థాపించేందుకు అవకాశం ఉన్న రంగాలు, ఈ దిశగా ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వం వైపు నుంచి అందుతున్న ఆర్థిక సహాయం, ఇప్పటికే వివిధ రంగాలలో ఉన్న వారికి అవసరమైన నైపుణ్య అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, వివిధ ప్రభుత్వ పథకాలపై చేతి వృత్తుదారులకు అవగాహన కల్పించే సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, తాలూకా సిఐ విజయకృష్ణ

డ్రగ్స్, ర్యాగింగ్‌పై విద్యార్థులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'మత్తు పదార్థాలు మానండి, మీ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోండి, కన్న వారి కలలను నేరవేర్చండి' అనే నినాదంతో వివిధ కాలేజీల విద్యార్థులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా కళాశాలలు మరియు పాఠశాలతో పాటు ప్రధానమైన కూడలిలో యువకులతో పాటు విద్యార్థులకు పై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పోలీసు సిబ్బంది మత్తు పదార్థాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం..

బాపట్ల జేసీగా భావన వశిష్ట

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా ప్రజానీకానికి సంబంధించిన భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. జిల్లాకు బదిలీపై వచ్చి కలెక్టరేట్‌కు చేరుకున్న జిల్లా సంయుక్త కలెక్టర్‌కు బుధవారం ఘన స్వాగతం లభించింది. డిఆర్‌ఓ గంగాధర్ గౌడ్, జిల్లా కలెక్టరేట్ ఏఓ మల్లిఖార్జునరావు పుష్పగుచ్చాలతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్చారణ, పూర్ణ కుంభంతో స్వాగతిస్తూ కార్యాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం జేసీ జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి.. మొక్క అందజేశారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా సంయుక్త కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. బాపట్ల జిల్లాకు సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని జాయింట్ కలెక్టర్ భావన తెలిపారు. ప్రభుత్వ పథకాలన్నీ జిల్లాలోని పేద ప్రజలకు అందేలా చూస్తామన్నారు. ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడకుండా పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ సక్రమంగా సాగేలా చూస్తామన్నారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తాను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేశానన్నారు. ఇంతకు ముందు కృష్ణా జిల్లాలో ఏసి యుటిగాను, పార్వతీపురంలో సబ్ కలెక్టర్‌గానూ, జిఎస్-ఎస్‌డబ్ల్యూఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ గానూ, ఎస్ఆర్ జిల్లాలో సంయుక్త కలెక్టర్, రిటర్నింగ్ అధికారిగానూ పనిచేసిన అనుభవం ఉందన్నారు. కాకినాడలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తుండగా బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ మేరకు ఇక్కడకు వచ్చామని, ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు, యస్.రామలక్ష్మి, బాపట్ల మండలం తహశీల్దార్ షేక్ సలీమా, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



జేసీ భావన వశిష్ట

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

17న నిరసనలు

స్ట్రగుల్ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం కానందున అక్టోబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఈ నెల 17న మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ భవన్ (ఎస్ఇ ఆఫీస్) వద్ద నిరసన చేపట్టాలని స్ట్రగుల్ కమిటీ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా స్ట్రగుల్ కమిటీ ఒంగోలు రీజియన్ ప్రకాశం జిల్లా అడ్వైజర్స్ జి.వి.రాగయ్య, ఎం.నరసింహారావు, అధ్యక్షులు ఇరుగుల శీను రెడ్డి,ప్రధాన కార్యదర్శి దండె రవికుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జీవీ. కొండారెడ్డి, అధ్యక్షులు శీలం ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చాట్రగడ్డ శ్యామ్ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 15న జరగాల్సిన సమ్మె వాయిదా పడినప్పటికీ, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు స్పష్టత లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయకపోవడం, వేతన వ్యత్యాసాలు కొనసాగించడం అన్యాయమన్నారు. ఒకే సంస్థ ఒకే సేవ ఒకే నియమావళి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేరుగా వేతనాలు చెల్లించడం ద్వారా విద్యుత్ సంస్థకు రూ.192 కోట్ల భారం తగ్గుతుందని, వేతన వ్యత్యాసం తొలగి, అరియర్స్ చెల్లించే వీలుంటుందని పేర్కొన్నారు. పీసీరేట్ వర్కర్లు, స్టోర్స్ హమాలీలు, మీటర్ రీడర్లు, పీసీఎలు, ఎటిఎంలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలన్నారు. కారుణ్య నియామకాల్లో లోపాలు సరి చేయాలని. నగదురహిత మెడికల్ పాలసీని విస్తరించాలని అర్హులైన ఉద్యోగులకు జేఈ, జేఏ కన్వర్షన్ ఇవ్వాలని నాయకులు కోరారు. కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయడం, నేరుగా వేతనాలు చెల్లించడం, జెఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు, పెండింగ్ డి.ఎలు, 2022 పీఆర్సీ బకాయిల చెల్లింపు, కనీస వేతనాలుఅమలు , ప్రైవేటీకరణ విధానాల రద్దు వంటి డిమాండ్ల పరిష్కారం చేయాలన్నారు. 17న నిరసన కార్యక్రమంను జయప్రదం చేయాలని వారు కోరారు.

ట్రంప్ విధానాలు దేశానికి ప్రమాదకరం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలు భారతదేశానికి ప్రమాదకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, జిల్లా నాయకులు జె.జయంతిబాబు పేర్కొన్నారు. బుధవారం నాడు మండలంలోని ఉప్పుగుండూరు బస్టాండ్ సెంటర్‌లో అమెరికా ఆధిపత్యాన్ని, ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి టి.శ్రీకాంత్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం నుంచి ఎగుమతులపై సుంకాల పెంపు, దిగుమతులపై సుంకాల తొలగింపు దేశ రైతాంగానికి నష్టదాయకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికాకు ప్రధాని మోడీ మోకరిల్లడం దుర్మార్గమైన చర్య అన్నారు. అమెరికా నుంచి మనదేశానికి దిగుమతి అయ్యే పత్తిపై గతంలో 11 శాతం ఉన్న సుంకాన్ని అమెరికా ఒత్తిడికి తలొగ్గి మోడీ పూర్తిగా ఎత్తివేశారన్నారు. తద్వారా అనేక కంపెనీలు తక్కువ రేటుకు దిగుమతి చేసుకుంటాయని, దీంతో ఇప్పటికే కష్టాల్లో పత్తి రైతులు.. మరింత కష్టాల్లో కూరుకుపోతారని పేర్కొన్నారు. అమెరికా నుండి దిగుమతయ్యే పాల ఉత్పత్తులైన జున్నుపై 30 శాతం, వెన్నపై 40 శాతం, పాలపొడిపై 60 శాతం చొప్పున మన దేశం విధిస్తున్న సుంకాలను తగ్గించాలని అమెరికా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోందన్నారు. అదే జరిగితే మన దేశంలో పాడి రైతాంగం దెబ్బతినడమే కాకుండా అమూల్ వంటి సంస్థలు కూడా మూతపడే ప్రమాదం ఉందన్నారు. దేశానికి హాని కలిగించే ఇటువంటి ట్రంప్ విధానాలకు, అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వం మోకరిల్లకుండా అందరు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. అనంతరం ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.బసవపున్నయ్య, ఎన్.రామారావు, యు.వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు



పనుల పురోగతిని పరిశీలిస్తున్న కలెక్టర్

హార్బర్ పనులు పూర్తయితే..

మత్స్యరంగం మరింత అభివృద్ధి

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-నిజాంపట్నం

ఆక్వా పార్క్, హార్బర్ అభివృద్ధి పనులు పూర్తయితే.. మత్స్య, ఆక్వా రంగం మరింత అభివృద్ధి కానుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. నిజాంపట్నం మండలం, దిండిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ అలాగే హార్బర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని బుధవారం నాడు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పరిశీలించారు. ఆక్వా పార్క్ అభివృద్ధికి టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించకపోవటానికి కారణాలను, అడ్డంకులపై మారిటైం బోర్డు అధికారులను ఆరా తీశారు. కలెక్టర్ వెంట జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, బోటు యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, మత్స్యశాఖ జేడీ శ్రీనివాస్ నాయక్, డీడీ గాలిదేవుడు, రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్.నాగలక్ష్మి ఉన్నారు.

సూర్యలంక అభివృద్ధి పనులు ప్రారంభించాలి..

స్వదేశీ దర్శన్-2.0 కింద సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. స్వదేశీ దర్శన్-2.0 అభివృద్ధి పనులపై అనుబంధశాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, ఏజెన్సీ ప్రతినిధులు, ఎస్ హెచ్ ఎ అధికారులు, గుత్తేదారుడు దిగ్విజయ్ సింగ్, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 308 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లాలో 308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని రైతులు వచ్చి యూరియా తీసుకొనివెళ్లవచ్చని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యూరియా కొరత ఏర్పడిందే సదరు సమాచారాన్ని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందురోజే తెలియజేయాలన్నారు.

పర్యాటకుల కోసం భద్రతా చర్యలు

బాపట్ల జిల్లా పరిధిలోని సూర్యలంక, చీరాల వాడరేవు, రామాపురం తదితర బీచ్ లకు వచ్చే పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని బీచ్లో పర్యాటకులు ప్రమాదాల గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రామాపురం బీచ్‌లో ఐదుగురు పర్యాటకులు ఈతకొడుతూ ప్రమాదానికి గురై మరణించారని ఆయన అన్నారు. బాపట్ల, చీరాల, రామాపురం బీచ్‌లో పర్యాటకులు భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీక్షణ సమావేశం లో జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా అగ్నిమాపక అధికారి వినోద్ పాల్గొన్నారు.

శక్తి యాప్, సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని విద్యార్థులకు పోలీస్ అధికారులు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ అధికారులు వారి పరిధిలోని పాఠశాలలు, కళాశాలలలోని విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాలలో శక్తి యాప్ వినియోగించుకోవాల్సిన విధానం, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల బారిన పడకుండా ఎలా అప్రమత్తంగా వ్యవహరించాలి, రోడ్డు భద్రతా నియమాలు, ఈవ్ టీజింగ్, మహిళా సంబంధిత చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని శక్తి బృందాలు సైతం ఈ కార్యక్రమాలలో పాల్గొన్నాయి.